క్లుప్తంగా

కొత్తపేట పరిధిలో యువకులకు కౌన్సెలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావు పార్కు, వీఎంసీ కాలనీ పరిసరాల్లో తిరుగుతున్న యువకులకు కొత్తపేట సీఐ కొండలరావు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, ఈవ్ టీజింగ్‌కు వ్యతిరేకంగా కొత్తపేట పోలీసులు బుధవారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కేఎల్ రావు పార్కు పరిసరాల్లో ఉన్న యువకుల వివరాలను ఆరా తీయడంతో పాటు తనిఖీ చేశారు. రోడ్లపైన, ఆటోలలో గుంపులు గుంపులుగా కూర్చుని ప్రజలకు ఇబ్బంది కలిగించినా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగమ్మ సత్రం కొండపై మల్లిపూడి దుర్గాభవానీ, వీర మహేష్ నెహ్రూలు నివాసం ఉంటున్నారు. దుర్గా భవానీకి గతంలో వివాహం కాగా విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. 2014లో వీర మహేష్ నెహ్రూను ప్రేమించి రెండో వివాహం చేసుకుంది. ఈ నెల 1వ తేదీన వీర మహేష్ నెహ్రూ నల్లజర్లలో ఉంటున్న తన తల్లికి అనారోగ్యంగా ఉందని చెప్పి ఊరు వెళ్లాడు. అప్పటి నుంచి మహేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. బుధవారం నల్లజర్లలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేయగా, వీర మహేష్ ఊరు రాలేదని చెప్పారు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రామాలయంలో అన్నదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నదానాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామి వారికి పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రముఖులు శీరం వెంకటరావు, కామందుల నరసింహారావు, బెవర శ్రీనివాసరావు, కొరగంజి భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, ఫణుకు రమా, పోతిన ధర్మారావు, పోతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పనుల పరిశీలన

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్ నగర్ కరకట్ట వద్ద జరుగుతున్న పైపులైను పనులను బుధవారం 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు పరిశీలించారు. 63వ డివిజన్ వడ్డెర కాలనీ నుంచి రాజీవ్‌నగర్ కరకట్ట వైపు వచ్చే నీరు బోరునీళ్లు వస్తున్నాయని.. అవి కలుషితమై దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు వాపోయారు. దీంతో వీఎంసీ అధికారులు ప్రత్యేక పైపులైను పనులు చేపట్టగా ఆమె దగ్గరుండి పరిశీలించారు.

శ్రీవారి ఆశీస్సులు సదా అందరిపై ఉండాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవారి నమూనా ఆలయాన్ని రూపొందించి అందులో తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుంటూరు జిల్లా పెనుమాకకు చెందిన శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రం సేవా సంఘం ఆధ్వర్యంలో భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో రెండో రోజు బుధవారం నిర్వహించిన శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అర్చక స్వాములు ఆయన్ని ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి ఉదయాస్తమాన సేవలను భక్తులకు అందిస్తున్న నిర్వాహకులు, సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావును ప్రశంసించారు. సాయంత్రం సమయంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు ఎంఎస్ రామారావు మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సుందరకాండ, హనుమాన్ చాలీసా వింటే సమస్త పీడలు, భయాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. శ్రీవారి దివ్య ఆశీసులు, ప్రసన్నాంజనేయుని చల్లని చూపు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వీడని గ్రహణం

- నిరుపయోగంగా దర్గా కమ్యూనిటీ హాల్ స్థలం
- స్థలం వద్దకు నిర్మాణ సామగ్రి వెళ్లేందుకు సరైన దారి లేదని సాకులు
- బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ఎమ్మెల్యే సుజనాచౌదరి ఎత్తుగడ
- 14 ఏళ్ల నుంచి ముస్లిం మైనార్టీల ఎదురుచూపు



పిచ్చి చెట్లు, చెత్తాచెదారంతో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్ స్థలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలు నివసించే భవానీపురం దర్గా(హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్) ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2011లో పట్టిన గ్రహణం ఇప్పటికీ వీడలేదు. దాదాపు మూడు వేలకుపైగా ముస్లిం మైనార్టీలు నివసించే ఈ ప్రాంతంలో జాతీయ రహదారి మీద నుంచి దర్గా లోపలకు వచ్చే రోడ్డు మాత్రమే సుమారు 10 అడుగులు ఉంటోంది(అది కూడా కొంత మేరకే). మిగిలిన అంతర్గత రోడ్లన్నీ కేవలం 3 – 2 అడుగుల వెడల్పులోనే ఉన్నాయి. దీంతో స్థానికులు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవాలన్నా వేదిక లేదు. పోనీ రోడ్డు మీద షామియానా వేసుకుని చేసుకుందామా అంటే అన్నీ ఇరుకు సందులే. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో నిర్వహించుకుందామంటే అద్దెలను భరించే ఆర్థిక స్తోమత లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు వారి ప్రయోజనార్థం నివాసాల మధ్య కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు పదిహేనేళ్ల క్రితమే నగరపాలక సంస్థ సుమారు 600 చదరపు గజాలు స్థలం కేటాయించింది. ఈ స్థలానికి ఉత్తరం, దక్షిణం రోడ్లు ఉన్నాయి. నాటి నుంచి నేటి వరకు ఆ స్థలం ఖాళీగా ఉంటూ నిరుపయోగంగా పడి ఉంది. స్థలం గురించి పట్టించుకునే నాథుడు లేక దానిలో పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎప్పుడు మొదలు పెడతారు. ఎప్పటికి పూర్తవుతుందా అని 14 ఏళ్ల నుంచి దర్గా వాసులు ఎదురు చూస్తున్నారు. దర్గాలో ప్రార్థనలు చేసేందుకు వచ్చే ప్రతి ప్రజాప్రతినిధికి మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అప్పటికి అలాగే అంటూ తలూపి వెళ్లిపోతారు తప్ప ఆ తరువాత మళ్లీ ఇటు వైపు తొంగిచూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.19.80 లక్షలతో నిర్మించేందుకు శంకుస్థాపన

ముస్లిం మైనార్టీల ప్రయోజనార్థం దర్గా ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు 2011లో అప్పటి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. వాటితోపాటు నగరపాలక సంస్థ రూ.14.80 లక్షలు మంజూరు చేసింది. మొత్తం రూ.19.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనానికి అప్పటి ఉమ్మడి కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్, గనులు, భూగర్భ వనరుల మంత్రి గల్లా అరుణకుమారి, పురపాలక శాఖ మంత్రి మానుగుంట మహీధరరెడ్డితో కలిసి నాటి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అహ్మదుల్లా శంకుస్థాపన చేశారు. అంతే.. ఆ తరువాత దాని గురించి పట్టించుకున్న నాథుడు, నాయకుడు లేరు. అనంతరం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులుగా గెలిచిన ఏ ఒక్క ఎమ్మెల్యే కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. దర్గాలోని బాబా సమాధిని దర్శించుకునేందుకు వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించుకోవడం..ఫలితం కోసం ఎదురు చూడటం స్థానికులకు పరిపాటిగా మారింది. వారిలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదని నిట్టూరుస్తున్నారు.



దర్గా మెయిన్ రోడ్ నుంచి కమ్యూనిటీ హాల్ స్థలానికి వెళ్లే ఇరుకు దారి

'సుజనా మిత్ర'లతో సమస్యలు పరిష్కరిస్తారట..!

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన యలమంచిలి సత్యనారాయణ(సుజనా) చౌదరి నియోజకవర్గానికి అప్పుడప్పుడు వచ్చే విజిటింగ్ ప్రొఫెసర్‌లా తయారయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ మధ్య సుజనా చౌదరి పశ్చిమంలోని కొందరు కార్పొరేటర్ల(జంప్ జిలానీలు)తో సమావేశమై 'సమస్య మీరు చెప్పండి, నేను చేయిస్తా' అంటూ చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పుడేమో పశ్చిమంలోని 22 డివిజన్లకు 'సుజన మిత్ర'ల పేరుతో 22 మందికో ఆర్డినేటర్లను నియమించి ఆయా డివిజన్లలోని సమస్యలను వారు పరిష్కరిస్తారని ప్రకటిస్తూ వారికి ఎలక్ట్రిక్ బైక్‌లు కూడా ఇచ్చారు. నియోజకవర్గంలో పర్యటించి ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ఇదొక ఎత్తుగడ అని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

శేషవాహనంపై కొలువుదీరిన కోదండరాముడు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం(కొత్తగుళ్లు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామస్వామి వారు బుధవారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం స్వామి వారికి దర్బార్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేష అర్చనలు..

ఈ సందర్భంగా ఉత్సవంలో పాల్గొన్న అందరికీ స్వామి వారి ఆశీస్సులను అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు నేత్రానందాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజనమండలి వారిచే భజన కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలోని మూలవిరాట్‌లకు విశేష అర్చనలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు ఆంజనేయాచార్యులు తదితరులు నిర్వహించారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళులు



సీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కమ్యూనిస్ట్ పార్టీ అగ్రనాయకుడు, భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావులోని క్రమశిక్షణ, నిబద్ధత నేటి తరం యువతకు ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ప్రజాశక్తినగర్‌లోని చండ్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో చండ్ర రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ చండ్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కృష్ణాజిల్లాలో పుట్టిన చండ్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించారన్నారు. ఆయన ఆస్తి మొత్తాన్ని పేదలకు పంచిపెట్టారని, చల్లపల్లి జమిందార్‌కు వ్యతిరేకంగా భూపోరాటాలు చేశారని గుర్తుచేశారు. పార్టీలో అత్యున్నత స్థానంలో ఉన్నప్పటికీ క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన సామాన్య కార్యకర్తగానే ఆయన జీవించారని చెప్పారు. చండ్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సీపీఐని బలోపేతం చేశారన్నారు. నాయకులు అరుణకుమార్, ఆనందరావు మాట్లాడుతూ.. చండ్ర రాజేశ్వరరావు చేసిన ఉద్యమాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కొల్లి రవి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

చండ్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పోరాటాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కమ్యూనిస్ట్ ఉద్యమ నేత చండ్ర రాజేశ్వరరావు(సీఆర్) స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. చండ్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రామకృష్ణ బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. సీఆర్ 26 ఏళ్ల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసిన తొలి తరం నాయకులు చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఈ దేశంలో ఉన్న ప్రజాస్వామ్యవాదులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం ఇబ్రహీంపట్నం క్లస్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగింది. మైలవరం క్లస్టర్ పరిధిలోని 20 పాల సంఘాలకు 2024–25 ఏడాదికి గాను మూడో విడత నాలుగు నెలల బోనస్ రూ.31,89,709 నగదు చెక్కును క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి లబ్ధిదారులకు అందజేశారు. క్లస్టర్ పరిధిలోని పాల సేకరణ కేంద్రం సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ముగిసిన రోబో డ్రోన్ ఫెస్ట్ - 2025



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో ఉత్తమ సాంకేతికను తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురునానక్‌నగర్, విజయనగర్ కాలనీలోని డాన్‌బాస్కో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రోబో డ్రోన్‌ఫెస్ట్–2025 ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులు రూపొందించిన వర్కింగ్ మోడల్స్‌ను పరిశీలించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన త్రీడీ ప్రింటింగ్, రోబోహ్యాండ్, మెడికల్ డిస్పెన్సర్, అంధులకు కళ్లజోడు తదితర ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆలిండియా మనాక్ ఇన్‌స్పైర్ పోటీల్లో గెలుపొందిన లికిత్ కుమార్‌ను బహుమతి అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ బిల్లు అంశంలో మాకు ఇష్టం లేదు అయినా తప్పలేదు'

వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు సంబంధించి తమ ప్రభుత్వానికి ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వాల్సి వచ్చిందని వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు అమ్ముతున్నామనే ప్రచారం అబద్ధమని, ఆ వార్తలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గడువు ముగిసిన లీజులకు తక్షణం టెండర్లు ఆహ్వానించాలని ఆదేశించామన్నారు. ఈ నెల నుంచి వక్ఫ్ బోర్డు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నామని చెప్పారు. వక్ఫ్ బోర్డు నుంచి వచ్చే ఆదాయం నుంచే సిబ్బంది జీత భత్యాలు చెల్లించాల్సి ఉందన్నారు. కమర్షియల్ భూములను ఖాళీగా ఉంచకుండా లీజ్‌కు ఇవ్వడం వల్ల వక్ఫ్‌బోర్డుకు ఆదాయం వస్తుందని తెలిపారు.

స్టెల్లాలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని స్టెల్లా కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నైస్ ఎడ్యుకేషన్ బ్లూ స్టార్, హెచ్‌డీబీ ఫైనాన్స్, ఫాక్ స్కాన్, స్పీకింగ్ ట్రీ, జీవీసీతా, టెక్ అవుట్ తదితర సంస్థలు విద్యార్థినులకు కమ్యూనికేషన్, స్కిల్స్, గ్రూప్ డిస్కర్షన్ వంటి అంశాలపై ఇంటర్వ్యూలు నిర్వహించి 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇంటర్వ్యూలను కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు లక్ష్మీ హేమ, అనుపమ పర్యవేక్షించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లోని శ్రీ కోదండ రామమందిరం సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో సీతారాములను ఉంచి దేవీనగర్ పురవీధుల మీదుగా ఊరేగించారు. ఊరేగింపులో కాళికా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ సభ్యులు స్వయంగా భక్తులతో కలిసి రథం లాగుతూ రామనామాల నడుమ ఊరేగింపు సాగించారు. దారి పొడవునా మహిళలు, భక్తులు సీతారాములకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు రాములోరి కల్యాణ విందు..

సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా దేవీనగర్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు సీతారాముల కల్యాణ విందు ఏర్పాటు చేసినట్లు ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు తెలిపారు. భక్తులు సీతారాములను దర్శించుకుని కల్యాణ విందును స్వీకరించాల్సిందిగా కోరారు.



రథాన్ని లాగుతున్న ఆలయకమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం



ఊరేగింపు నిర్వహిస్తున్న నిర్వాహకులు, అర్చకులు



హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం ప్రారంభమైంది. శ్రీమణికంఠ సేవా సమతి వ్యవస్థాపకుడు బెవర రాము గురుస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం అయ్యప్ప స్వామి విగ్రహం, కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు, హోమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను బెవర రాము పర్యవేక్షించగా, దేవీ లక్ష్మీనారాయణచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ వైభవంగా జరిపించారు. సాయంత్రం శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన జరిగాయి. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరలించారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ, భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బెవర రాము పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం అయ్యప్ప స్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అనంతరం మహా పూర్ణాహుతితో మహాయజ్ఞం పూర్తవుతుందని చెప్పారు.

జీవనోపాధి అవకాశాలపై సర్వే



మైలవరం: మైలవరం మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులకు జీవనోపాధి అవకాశాలు కల్పించే నిమిత్తం యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని వెలుగు ఏపీఎం ఎస్. శామ్యూల్ అన్నారు. మైలవరం వెలుగు కార్యాలయంలో గ్రూపుల సభ్యులకు అవగాహనన సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యుల జీవనోపాధికి ఎంత మొత్తంలో నిధులు కావాలి, ఏ నెలలో కావాలి తదితర సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రూపు సభ్యులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రూపు లీడర్లు, గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలవాలిన మునగ

రైతులకు తీవ్ర నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో రెండు రోజుల కిందట వీచిన ఈదురు గాలులతో ఉద్యాన పంటలైన మునగ తోటలు నేలవాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని కేతనకొండ, మూలపాడు, కొటికలపూడి, జూపూడి గ్రామాల్లో సుమారు 15 ఎకరాల్లో రైతులు మునగసాగు చేపట్టారు. ఏడు నెలలుగా మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాపు దశలో ఉన్న సమయంలో అకాల వర్షం, ఈదురు గాలులతో మొక్కలు విరిగిపోగా, మరి కొన్ని మొక్కలు పూర్తిగా వంగిపోయి నేలవాలాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు దెబ్బతిన్న మునగ తోటలను పరిశీలించారు. మునగ మొక్కలు వేర్లతో సహా బయటకు పీక్కొస్తేనే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని అధికారులు చెబుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి

ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతకుముందు వరద ప్రభావంతో మునగ పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఏడాదిలో రెండు సార్లు సాగు చేయడంతో రైతులు అధికంగా ఖర్చులు భరించాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మునగ రైతులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎమ్మెల్యే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ, మున్సిపాలిటీ కార్మికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీలలో లక్షల మంది కార్మికులు ఆప్కాస్ పరిధిలో పని చేస్తున్నారన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కూడా దాదాపు 340 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాగా మున్సిపాలిటీలో గత కొద్ది కాలంగా రెండు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వటం లేదని, గతంలో సమ్మె కాలంలో కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు మధిర ఏడుకొండలు, షేక్ మస్తాన్‌వలి, చొప్పవరపు రత్నకరుణ, బిక్షాలు, డేవిడ్‌రాజ్, జ్యోతి మేరి, వెంకటరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నవరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో చైత్ర మాస వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకూ ఆలయంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మూల మంత్ర హోమాలు, ఔపాసన బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.